క్లుప్తంగా

గొప్ప సంఘసంస్కర్త కందుకూరి



కందుకూరి వేషధారణలో రామానాయుడు

విజయనగరం టౌన్‌: గొప్ప సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు అని తెలుగు భాషా సేవా సంఘం అధ్యక్షుడు ఆర్‌బీ రామానాయుడు కొనియాడారు. నగర పరిధిలోని కణపాకలో ఉన్న సంఘ కార్యాలయంలో కందుకూరి వీరేశలింగం వర్ధంతి మంగళవారం నిర్వహించారు. ఆయనతో పాటు పలువురు కందుకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం సమాజానికి కందుకూరి చేసిన సేవలను గుర్తు చేశారు. బాల్యవివాహాల నిర్మూలనకు విశేష కృషి చేయడంతో పాటు వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించిన ఘనత కందుకూరిదేనన్నారు. చిన్నతనంలోనే వసుచరిత్ర పుస్తకం చదివి విద్యార్థి దశ నుంచే పోరాటాలు చేశారన్నారు. మూఢనమ్మకాలు పారద్రోలేందుకు అమావాస్య రోజున శుభకార్యాలు చేశారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని, యువత, విద్యార్థు లంతా నడవాలని కో రారు. ఇదిలా ఉండ గా, కందుకూరి వేషధారణలో రామానా యుడు మెరిసి, ప్రత్యే క ఆకర్షణగా నిలిచా రు. కార్యక్రమంలో పిన్నింటి ఆదిలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 175 మంది ఎంపిక



మాట్లాడుతున్న ఐటీఐ జిల్లా కన్వీనర్‌ గిరి

విజయనగరం అర్బన్‌: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం నిర్వహించిన జాబ్‌ మేళా(ప్లేస్‌మెంట్‌ డ్రైవ్‌)లో వివిధ ఉద్యోగాలకు 175 మంది విద్యార్థులు ఎంపికై నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్‌ టీవీ గిరి తెలిపారు. 10 కంపెనీలు తమ సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించగా, 386 మంది ఐటీఐ విద్యార్థులు హాజరయ్యారని, వారిలో 175 మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన వారిలో స్థానిక ప్రభుత్వ ఐటీఐకి చెందిన 146 మంది, రాజాం ఐటీఐ నుంచి వచ్చిన వారిలో 49 మంది ఉన్నారన్నారు. ఐటీఐ చివరి ఏడాది విద్యార్థులు పరీక్షల అనంతరం ఉద్యోగాల్లో చేరవచ్చని తెలియజేస్తూ కంపెనీలు ఆఫర్‌ లెటర్స్‌ ఇచ్చాయి. కార్యక్రమంలో రాజాం ఐటీఐ ప్రిన్సిపాల్‌ బి.భాస్కరరావు, ప్లేస్‌మెంట్‌ ఆఫీసర్లు జి.రామాచారి, కె.నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామం నుంచి 7 బృందాలు రావాలి

పూసపాటిరేగ: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని చింతపల్లిలో జూన్‌ 6న జరిగే యోగా కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి 7 బృందాలు(ఒక్కో బృందంలో 50 మంది) హాజరయ్యేలా చూడాలని ఎంపీడీవో ఎం.రాధిక ఆదేశించారు. ఇదే విషయమై ఆమె మండల కేంద్రంలోని తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వైద్యారోగ్య సిబ్బందితో మంగళవారం సమావేశమయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ జ్ఞానేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్‌ నిషేధమే అభిమతం

రాజాం సిటీ: పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో పాలిథిన్‌ నిషేధమే ప్రతీ ఒక్కరి అభిమతం కావాలని రాజాం రెడ్‌క్రాస్‌ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌ కుమార్‌, పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్‌ ఆర్‌.వి.జె.నాయుడు అన్నారు. రాజాంలోని కల్కి ట్రేడర్స్‌ యజమాని సమకూర్చిన 600 గుడ్డ సంచులను పట్టణంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చేటప్పుడు చేతి సంచి పట్టుకుని రావాలని, పాలిథిన్‌ను అరికట్టేందుకు కృషిచేయాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ మనచేతుల్లోనే ఉందని, భావితరాల భవిష్యత్‌ కోసం ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని అన్నారు. పొట్నా సత్యనారాయణ గుప్త, పెంకి చైతన్య, వాకచర్ల పైడిరాజు, ఆల్తి మోహనరావు, జోల వాసు, ఏ.బాలమురళి, పాదిలాపు శ్రీను ,తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు

వంగర: మండల పరిధిలోని అరసాడ శ్రీసంతోషిమాత ఆలయం ఆవరణలో రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. మంగళవారం ఎదురెదురుగా వెళ్తున్న ఆ ఇద్దరు వ్యక్తుల బైక్‌లు ఢీకొనడంతో బూరాడకు చెందిన శంకరరావుకు తలకు గాయాలు కాగా, పోరాంకు చెందిన కుడి కాలికి గాయాలయ్యాయి. 108కు స్థానికులు సమాచారం అందించడంతో ఈఎంటీ విశ్వనాథ్‌, పైలట్‌ సాయిబాబా క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి రాజాంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై దర్యాప్తు చేసి కేసు నమోదు చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

మొక్కే కదా అని పెంచితే..

- కోనోకార్పస్‌తో కీడు!
- ఆస్తమా, అలర్జీ వంటి శ్వాసకోశ వ్యాధులు తలెత్తే అవకాశం
- విజయనగరంలో విరివిగా పెంపకం
- ఆందోళన చెందుతున్న నగరవాసులు



రామానాయుడు రోడ్డు డివైడర్‌లో ఇలా..



విజయనగరంలోని అయ్యకోనేరు రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కోనోకార్పస్‌ చెట్లు

విజయనగరం: మొక్కే కదా అని పెంచితే..ఆఖరికి పెంచినోళ్ల పీకే కోసేస్తాదనేలా కోనోకార్పస్‌ మొక్కల గూర్చి ప్రచారం జోరుగా నడుస్తోంది. శంకువు ఆకారంలో ఎంతో అందంగా కనిపించే ఈ చెట్లు చాలా పర్యావరణానికి హానికరమని పలువురు చెబుతున్నారు. తక్కువ కాలంలో ఏపుగా పెరిగే ఈ మొక్కలను పచ్చదనం, నీడ కోసం రోడ్లు పక్కన, డివైడర్లలో పెంచుతుంటారు. వీటి వల్ల నష్టమే తప్ప లాభమేమీ లేదంటున్నారు. కనీసం పక్షులు కూడా వాలని ఈ చెట్లు వల్ల మనుషులకు ఆస్తమా, అలర్జీ వంటి శ్వాసకోశ వ్యాధులు వస్తాయని తెలియజేస్తున్నారు. పైగా ఈ చెట్ల వేర్లు భూమి లోపలికి బాగా పెరిగి కుళాయి పైపులైన్లు ధ్వంసం చేస్తాయని అంటున్నారు.

హుద్‌హుద్‌ తర్వాత నాటినవే..

2014లో వచ్చిన హుద్‌హుద్‌ తుపాను గాలులకు పచ్చదనం బాగా దెబ్బతింది. అప్పట్లో అధికారంలోని టీడీపీ ప్రభుత్వం తిరిగి పచ్చదనం నెలకొల్పేందుకు ఈ మొక్కలను తెరపైకి తీసుకువచ్చింది. ఫలితంగా విజయనగరంలోని గుమ్చీ జంక్షన్‌ నుంచి అయ్యకోనేరు తూర్పుగట్టు వరకు ఉన్న మార్గంతో పాటు గంటస్తంభం జంక్షన్‌ నుంచి కార్పొరేషన్‌ కార్యాలయం వెళ్లే జంక్షన్‌, మహారాజా కళాశాల నుంచి ఎస్‌బీఐ మెయిన్‌ బ్రాంచి జంక్షన్‌ వరకు అలాగే బాలాజీ జంక్షన్‌ నుంచి రింగురోడ్డు ఐస్‌ ఫ్యాక్టరీ జంక్షన్‌ల వద్ద వెలిశాయి. మొన్నీమధ్య ఇవే మొక్కలు పర్యావరణానికి అత్యంత హానికరమని ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ మాట్లాడిన మాటలు ఈ మొక్కలతో డేంజర్‌ అనే ప్రచారానికి ఒకింత బలం చేకూరుస్తున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నగరవాసులు ఆందోళన చెందుతున్నారు. పనికిరాని చెట్లు పదెందుకు.. పనికొచ్చే చెట్టు ఒక్కటి చాలు కదా అని సలహా ఇస్తున్నారు.

ఫిర్యాదులు రాకుండా.. రేషన్‌ షాపులు నిర్వహించండి



డీలర్లకు సూచనలిస్తున్న తహసీల్దారు గోవింద

పూసపాటిరేగ: ఫిర్యాదులు రాకుండా రేషన్‌షాపులు నిర్వహించాలని తహసీల్దారు తాడ్డి గోవింద సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో రేషన్‌షాపుల డీలర్లతో మంగళవారం సమావేశమైన ఆయన.. జూన్‌ 1వ తేదీ నుంచి పాత రేషన్‌విధానం రద్దు అయి, కొత్త రేషన్‌ విధానం అమలులోకి వస్తుందని తెలిపారు. ఇక నుంచి గతంలో లాగా ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్‌ పంపిణీ ఉండదని, మళ్లీ పాత విధానంలో ఇచ్చిన లాగే రేషన్‌షాపుల వద్దే సరుకులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో రేషన్‌ పంపిణీ సక్రమంగా చేయాలని, ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అధికారుల వద్దకు వెళ్లకుండా చూడాలన్నారు. ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్‌ పంపిణీ జరగాలని, ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మళ్లీ సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు షాపులు తెరిచి ఉంచి, నిత్యావసరాలు పంపిణీ చేయాలని చెప్పారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో సీఎస్‌డీటీ మురళి, డీలర్ల సంఘం ప్రతినిధి పి.రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా



విజయనగరం జిల్లా ఉపాధి కార్యాలయం వద్ద శ్రీవెంకట్‌రామా పౌల్ట్రీ కార్మికులు మంగళవారం ధర్నాకు దిగారు. చీపురుపల్లి మండలంలోని కర్లాం, అలజంగి గ్రామాల్లో నిర్వహిస్తున్న సదరు పౌల్ట్రీల్లో పనిచేస్తున్న పలువురు సిబ్బందిని యాజమాన్యం తప్పించడాన్ని వారు ఖండించారు. కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న సదరు సంస్థ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. అలాగే విధుల నుంచి తొలగించిన వారిని తక్షణమే విధుల్లోకి చేర్చుకోవాలని కోరారు. స్థానికులను కాదని, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌, బీహార్‌ రాష్ట్రాల నుంచి కార్మికులను తెప్పించుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మొదట్లో స్థానికులకే 75 శాతం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్న మాట మరిచారా అని నిలదీశారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎ.జగన్మోహనరావు, బి.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

-విజయనగరం గంటస్తంభం

దీపారాధన



నెల్లిమర్ల మండలం, ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీసీతారాములస్వామి వారి దేవస్థానంలోని ఆంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం ప్రత్యేక దీపారాధన నిర్వహించారు. వేకువజామున ప్రాతఃకాలార్చన అనంతరం స్వామికి పంచామృతాలు, వివిధ ఫలరసాలతో అభిషేకం చేశారు. అనంతరం తమలపాకులు, సింధూరంతో పూజలు చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

-నెల్లిమర్ల రూరల్‌

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా సాధన చేయిస్తున్న గురువు

భోగాపురం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యమని, ప్రతిఒక్కరూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలని ఎంపీడీవో కిశోర్‌కుమార్‌ సూచించారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. యోగా సాధనకు వచ్చిన ఔత్సాహికులను ఉద్దేశించి, ఎంపీడీవో కాసేపు మాట్లాడారు. యోగా చేయడం ద్వారా సత్ఫలితాలు ఉంటాయని, క్రమం తప్పకుండా యోగా చేస్తే ఏ రోగం మన దరిచేరదన్నారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారితో యోగాసనాలు వేయించి, వాటి ప్రయోజనాలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో గాయత్రి, ఏవో కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పండగగా ఎన్టీఆర్‌ జయంతి

విజయనగరం అర్బన్‌: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, దివంగత ఎన్టీ రామారావు(ఎన్టీఆర్‌) జయంతి రాష్ట్ర పండగలా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కలెక్టరు డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ మంగళవారం ఓ ప్రకటనలో ఈ విషయం తెలియజేశారు. ఈ నెల 28వ తేదీ ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌ వద్ద ఎన్టీఆర్‌ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, కలెక్టర్‌ కార్యాలయ అధికారులు, సిబ్బంది అంతా హాజరుకావాలని కోరారు.

విజయనగరంలో దొంగల హల్‌చల్‌



ప్రదీప్‌నగర్‌లో అర్ధరాత్రి సమయాన సీసీ కెమెరాలో రికార్డు అయిన దొంగలు(ఫైల్‌)

విజయనగరం క్రైమ్‌: చీపురుపల్లిలో ఈ నెల 23న ఓ ఇంటిలోని ఇద్దరు వృద్ధులపై దొంగలు దాడిచేసి బంగారు నగలు దోచుకున్న విషయం తెలిసిందే. అది జరిగిన రెండు రోజులకు విజయనగరం ప్రదీప్‌నగర్‌లో ఓ ఆరుగురు దొంగల ముఠా బైక్‌లు దొంగిలించేందుకు ప్రయత్నించారు. పోలీసుల గస్తీతో వారి పని పూర్తికాలేదు. ఈ దృశ్యాలు పలువురి ఇళ్లకు ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల్లో రికార్డు కావడం, ఇవి పోలీసుల దృష్టికి వెళ్లడంతో ఆరా తీస్తున్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు అధికమంది నివసించే ప్రదీప్‌ నగర్‌ను దొంగలు ఎంచుకోవడం పోలీస్‌ వర్గాలను ఉలికిపాటుకు గురిచేసింది. పోలీస్‌ కంట్రోల్‌ రూమ్‌కు బైజాగ్‌–ధర్మపురి రోడ్‌లో దొంగతనాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదుల మేరకు వన్‌టౌన్‌ ఎస్‌ఐ లక్ష్మీప్రసన్న కుమార్‌ తన బృందంతో ఈ నెల 25న నాకాబందీ నిర్వహించారు. అదే రోజు రాత్రి దొంగలు ఆ ప్రాంతంలో సంచరించడం స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది.

విస్తరిస్తోన్న ఆయిల్‌ పామ్‌ సాగు

- ఆయిల్‌పామ్‌ తోటల పెంపకంపై రైతుల ఆసక్తి
- రాజాం నియోజకవర్గంలో క్రమంగా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- తక్కువ పెట్టుబడితో అధిక లాభం
- నియోజకవర్గ రైతులకు అందుబాటులో ఆయిల్‌ మిల్లు



రేగిడి మండలం ఖండ్యాం సాగులో ఉన్న ఆయిల్‌ పామ్‌



రాజాం మండలంలోని సోపేరులో కొత్తగా వేసిన ఆయిల్‌ పామ్‌ మొక్కలు

రాజాం: నియోజకవర్గ రైతులు వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్‌ ఉన్న పంటలతో పాటు తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమతో మంచి ఆదాయం వచ్చే పంటలను ఎంపిక చేసుకుంటున్నారు. కొంతకాలం క్రితం నియోజకవర్గంలో డ్రాగన్‌, తైవాన్‌ జామ వంటి పండ్ల తోటలు కొత్తగా సాగులోకి రాగా... తాజా గా ఆయిల్‌ పామ్‌ సాగు విస్తీర్ణం పెరుగుతోంది. అందుబాటులో ఆయిల్‌ మిల్లులు ఉండడం, మిల్లు యాజమాన్యమే మొక్కలు పంపిణీ చేస్తుండడంతో రైతులు ఈ పంట ను సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు.

450 ఎకరాల్లో..

ప్రస్తుతం రాజాం నియోజకవర్గంలో ఆయిల్‌పామ్‌ తోటలు 450 ఎకరాల్లో సాగులో ఉన్నాయి. ఈ మధ్యకాలంలో వీటి సాగు అధికమైంది. అత్యధికంగా వంగరలో 320 ఎకరాలు, రేగిడిలో 35 ఎకరాలు, రాజాంలో 30 ఎకరాలు, సంతకవిటిలో 20 ఎకరాల మేర రైతులు సాగుచేస్తున్నారు. రైతులకు ఈ మొక్కలను రేగిడి మండలంలోని శ్రీనివాసా ఆయిల్‌మిల్‌ పంపిణీ చేస్తోంది. ఈ పంటసాగుపై ఆసక్తి ఉన్న రైతులు ఉద్యానవనశాఖాధికారులను సంప్రదించాల్సి ఉంటుంది. నీటి వనరులు, మట్టిసారం పరిశీలించిన అనంతరం ఆ శాఖ అధికారులు మొక్కల నిమిత్తం ఆయిల్‌మిల్లుకు ప్రతిపాదనలు పంపిస్తారు. ఈ అనుమతుల ప్రకారం ఆయిల్‌మిల్లు యాజమాన్యం నర్సరీ ల నుంచి మొక్కలు తెప్పించి ఎకరానికి 57 మొక్కలు చొప్పున రాయితీపై అందజేస్తుంది. వీటిని ఉద్యానవనశాఖ అధికారుల సమక్షంలో ట్రై యాంగిల్‌ విధానంలో పొలంలో నాటాల్సి ఉంది. సకాలంలో పంటకు నీరు అందేలా రైతులు చూసుకోవాలి

నాలుగో ఏడాది నుంచి 30 ఏళ్ల వరకు ఆదాయం

ఆయిల్‌పామ్‌ మొక్కలు నాటిన తర్వాత మూడో ఏడాది పూతకు వచ్చి, నాలుగో ఏడాది పంట కోతకు వస్తుంది. ఏడాదికి ఎకరానికి 8 నుంచి 10 టన్నుల పామాయిల్‌ పిక్కలు దిగుబడి వస్తుండగా, ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను ధర రూ.21 వేల నుంచి రూ.22 వేల వరకు పలుకుతోంది. ఈ ధర ప్రకారమే రేగిడిలోని శ్రీనివాసా ఆయిల్‌ పామ్‌ ఫ్యాక్టరీ కొనుగోలుచేసి, రైతుకు నగదుచెల్లిస్తోంది. గతంలో కంటే ప్రస్తుతం ఈ పామాయిల్‌ పిక్కల ధర టన్నుకు రూ.3 వేల మేర పెరిగింది. మొక్కలు నాటిన నాలుగో ఏడాది నుంచి 30 ఏళ్ల వరకూ పెట్టుబడిలేని ఫలసాయాన్ని పొందవచ్చు.

రాయితీపై డ్రిప్‌ పరికరాలు

ఆయిల్‌ పామ్‌ పంట సాగుచేసే రైతులకు ఉద్యానవనశాఖ తోడుగా నిలుస్తోంది. వ్యవసాయ బోర్లు ఉన్న రైతులకు మైక్రోఇరిగేషన్‌ పథకంలో భాగంగా రాయితీపై డ్రిప్‌ పరికరాలు,పైపులు అందజేస్తోంది. అయిదెకరాల లోపు రైతులకు 90 శాతం, అయిదెకరాలు దాటిన రైతులకు 50 శాతం మేర రాయితీతో ఈ పరికరాలు అందిస్తున్నారు. పంటకు డ్రిప్‌ ద్వారా నీరు అందించడం వల్ల పూత బాగా వస్తుందని, మొక్కలకు నీరు కూడా సమృద్ధిగా అందుతుందని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు.

మంచి ఆదాయం

ప్రస్తుతం పామాయిల్‌ పిక్కలకు మార్కెట్‌లో డిమాండ్‌ ఉంది. అందుబాటులో మంచి మొక్కలు కూడా వస్తున్నాయి. రాజాం నియోజకవర్గంలోని రైతులకు రేగిడిలోని శ్రీనివాసా ఆయిల్‌ పామ్‌ ఇండస్ట్రీ బాగా సహకరిస్తోంది. రైతులు ఈ పంటలు సాగుచేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం పొందవచ్చును.

–సీహెచ్‌.ఉమామహేశ్వరి,ఉద్యానవనశాఖఅధికారి, రాజాం

మూడెకరాల్లో సాగు చేస్తున్నాం..

మా బంధువులు వంగర మండలంలో పామాయిల్‌ తోటలు సాగుచేస్తున్నారు. ఆదాయం బాగుందని చెప్పారు. ప్రస్తుతం చెరకకు డిమాండ్‌ తగ్గడంతో ఆ పొలంలో పామాయిల్‌ తోటలు వేశాం. మూడుఎకరాల్లో పంట సాగులో ఉంది.

– ఆర్‌. నర్సింహమప్పుడు, రైతు, ఖండ్యాం, రేగిడి మండలం